
వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు


రాయచోటి: ఉమామహేశ్వరి అమ్మవారి ఊరేగింపు


రాజంపేట టౌన్: గంధం అలంకారంలో వాసవీమాత


రాజంపేట టౌన్: పురవీధుల్లో ఊరేగుతున్న వీరచౌడేశ్వరీ


సిద్దవటం: గ్రామోత్సవంలో దుర్గమ్మ ఉత్సవ విగ్రహం


ఒంటిమిట్ట: దోలాధిరోహణ అలంకారంలో కన్యకాంబ


సుండుపల్లె: కన్యకా పరమేశ్వరీ అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు


నందలూరు: వాసవీ మాత ఊరేగింపులో పాల్గొన్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి


చిట్వేలి: పత్తితో శ్యామలాంబ దేవి అలంకరణ


రైల్వేకోడూరు అర్బన్: మహాలక్ష్మి అలంకారంలో..


రైల్వేకోడూరు అర్బన్: వాసవాంబ అలంకారం..


సంబేపల్లె: శ్రీ రాజరాజేశ్వరీ దేవిగా నల్లగంగమ్మ


చిన్నమండెం: ప్రత్యేక అలంకరణలో వాసవీ మాత

గత పది రోజులుగా వైభవంగా కొనసాగిన దసరా ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దసరా సందర్భంగా అమ్మవారి ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో, పట్టు వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి ఊరేగించారు. ఊరేగింపులో భక్తులు పెద్దఎత్తున పాల్గొనడంతో రోడ్లన్నీ జనసందోహంతో నిండిపోయాయి. రాజంపేటలో ఆర్యవైశ్యులు వసంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొగటవీర క్షత్రియులు జ్యోతుల ఉత్సవం ఉత్సాహంగా సాగింది. పెద్దఎత్తున టపాసులు కాల్చారు. ఆకాశంలో టపాసుల విన్యాసాలు ప్రజలను అబ్బురపరిచాయి.

– సాక్షి, నెట్‌వర్క్


రాజంపేట టౌన్: పట్టణంలో వైభవంగా సాగిన జ్యోతుల ఉత్సవం


ఓబులవారిపల్లె: కట్టాపుట్టాలమ్మ సన్నిధిలో వాహన పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు


సిద్దవటం: ఆకట్టుకున్న మహిళల కోలాట నృత్య ప్రదర్శన


పుల్లంపేట: మారెమ్మ తల్లికి పొంగళ్లు పెట్టుకుంటున్న భక్తులు


లక్కిరెడ్డిపల్లె: అమ్మవారి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో గ్రామస్తులు


పెనగలూరు: దుర్గామాత ఉత్సవ విగ్రహ ఊరేగింపులో యువకులు

క్లుప్తంగా

కన్యకా పరమేశ్వరీని దర్శించుకున్న మంత్రి


కన్యకా పరమేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి దంపతులు

రాయచోటి (జగదాంబసెంటర్) : విజయదశమి సందర్భంగా రాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి వారికి శనివారం రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి కుటుంబ సమేతంగా పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రాయచోటి పట్టణం గాంధీబజార్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవస్థానంలో కూడా మంత్రి కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఐదు సంవత్సరాలలో రాష్ట్రం సుభిక్షంగా ఉండి అన్నమయ్య జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని వేడుకున్నట్లు చెప్పారు.

వెంకన్నకు మంత్రి పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని అడవికమ్మపల్లె శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి శనివారం స్వామి వారిని దర్శించుకున్నారు. దసరా సందర్భంగా ఆలయలంలో స్వామి అమ్మవార్లకు మంత్రి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు గావించారు. అనంతరం నాయకులతో పలు సమస్యలపై చర్చించారు.

జస్విత హ్యాండ్లూమ్స్ ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

సిద్దవటం : కొత్త మాధవరంలో సర్పంచ్ చేపూరి ఓబయ్య నూతనంగా ఏర్పాటు చేసిన జస్విత హ్యాండ్లూమ్స్‌ను శనివారం రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప నగర మేయర్ సురేష్‌బాబు, వైఎస్‌ఆర్‌సీపీ మండల ఇన్‌చార్జి మేడా మధుసూదన్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఆకేపాటి వేణుగోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ నీలకంఠారెడ్డి, టక్కోలు క్రిష్టారెడ్డి, వల్లిచాన్ కె.వి. సుబ్బయ్య, మేకపాటి సుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, టి.వెంకటసుబ్బారెడ్డి, గౌడా రామచంద్రయ్య చేపూరి నరసింహారావు, మల్లేష్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వాసవీ లక్కీ డ్రా విజేత రవీంద్ర


విజేతకు బహుమతిని అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నందలూరు : దసరా మహోత్సవాలు సందర్భంగా నాగిరెడ్డిపల్లె గ్రామంలో వెలసిన శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహించిన లక్కీ డ్రాలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన రవీంద్ర విజేతగా నిలిచి మొదటి బహుమతి 150 గ్రాముల వెండి చెంబును గెలుచుకున్నాడు. ద్వితీయ బహుమతి అభినయ్ మొబైల్ ఫోన్‌ను, తృతీయ బహుమతిని నాగసురేంద్ర కుమార్ వెండి దీపాలను గెలుచుకున్నారు. అలాగే 30 మందికి కన్సోలేషన్ బహుమతులు కూడా అందజేశారు. ఈ లక్కీడ్రా కార్యక్రమానికి రత్నంశెట్టి, భూపాలెం రాఘవేంద్ర, గెలివి నాగిశెట్టి, శ్రీరామ్ హరినాథ్‌లు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు ఎంబలూరు నరసింహస్వామి, మాకం వెంకటకుమార్, చలపాటి నరసింహశెట్టి, గెలివి నాగసురేంద్ర కుమార్, ఎంబలూరు నరసింహ ప్రసాద్ పాల్గొన్నారు.

బోరు ఏర్పాటు


బోరు వేయిస్తున్న సర్పంచ్ నాగార్జునాచారి

వీరబల్లి : మండలంలోని మట్లి పంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కరించడమే ధ్యేయమని సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి తెలిపారు. ఆదివారం పంచాయతీలోని ఆసాదివాండ్లపల్లిలో తీవ్ర తాగునీటి ఎద్దడి ఉండటంతో బోరు వేయించారు.

పరిమళించిన మానవత్వం

మదనపల్లె సిటీ: ఓ దినసరి కూలీ అనారోగ్యంతో మృతి చెందడంతో స్థానికులు అంత్యక్రియలు చేసి మానవత్వం చాటుకున్నారు. మదనపల్లె పట్టణం సైదాపేటకు చెందిన వేణు(50) దినసరికూలీగా బెంగళూరు బస్టాండులో పని చేస్తూ జీవిస్తున్నాడు. శనివారం రాత్రి బస్టాండు వద్ద వేణు ఆకస్మాత్తుగా కిందపడిపోయాడు. తలకు పెద్ద గాయం కావడంతో మృతి చెందాడు. ఉదయం స్థానికులు గుర్తించి విషయాన్ని సీఐ చాంద్‌బాషాకు తెలియజేశారు. బంధువులు రాలేకపోవడంతో సీఐ దగ్గరుండి అంత్యక్రియలు జరిపించారు.

ఇసుక క్వారీల పేరుతో రైతుల కడుపుకొట్టద్దు


మాట్లాడుతున్న గాలివీటి మదన్‌రెడ్డి

వీరబల్లి : మండలంలో ఇసుక క్వారీల పేరుతో రైతులు కడుపు కొట్టవద్దని రాజంపేట నియోజకవర్గపు వైఎస్సార్‌సీపీ యువ నాయకులు గాలివీటి మదన్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన నివాసంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ప్రభుత్వం మండలంలో మాండవి నదిలో ఇసుక క్వారీలు పెట్టుటకు ప్రయత్నాలు చేస్తున్నది. ఈ క్వారీలు వెంటనే ఆపాలన్నారు. మండలంలో నడిబొడ్డున అన్ని గ్రామ పంచాయతీలు కలుపుకుంటూ మాండవ్య నది ప్రవహిస్తోందన్నారు. ఈ నది మీద రైతులు, ప్రజలు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, ఈ నది నీటితో పంటలు పండించుకోవడానికి, ప్రజలకు తాగడానికి నీళ్లు ఈ నది తప్ప మరొకటి దారి లేదు. ఈ నదిలో ఇసుకశాతం మూడు మీటర్ల లోతు తప్ప ఎక్కువ లోతు లేదన్నారు. మూడు మీటర్లు తరువాత అంతా రాయి ఉందన్నారు. అలాంటప్పుడు ప్రభుత్వం ఇసుక క్వారీలు పెట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇసుక కోసం మండలంలోని రైతాంగాన్ని, ప్రజలకు అన్యాయం చేయడం తగదని పేర్కొన్నారు. ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారులు ఈ విషయమై దృష్టి సారించాలని తెలియజేశారు.

కరువు మండలంగా ప్రకటించాలి

వీరబల్లి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని గాలివీటి మదన్ రెడ్డి చెప్పారు. మండలంలో వర్షాలు పడకపోవడంతో రైతులు పంటలు పండించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, బోర్లలో, బావుల్లో నీటిశాతం పూర్తిగా తగ్గిపోవడంతో పంటలు పెట్టక అప్పులు చేసుకొని జీవిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం రైతులకు రైతు భరోసా కింద రూ. 20 వేలు జమ చేస్తామని చెప్పి ఇంతవరకు రైతుల ఖాతాలలో జమ చేయకపోవడంతో శోచనీయమన్నారు. రైతులకు అందవలసిన సంక్షేమ పథకాలన్నీ అందించాలన్నారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ


వృద్ధురాలికి పింఛన్ ఇస్తున్న ట్రస్టు అధినేత

ఒంటిమిట్ట : మండల కేంద్రం శివారులో ఉన్న నూరుల్లా ఇస్లాం ట్రస్టు నందు ఆ సంస్థ అధినేత అబ్దుల్ సుహాన్ నిరుపేదలకు, దివ్యాంగులకు, మౌజన్‌లకు శనివారం ఇస్లాం ట్రస్టులో ఆర్థికంగా వారికి పింఛన్లు అందించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సుహాన్ మాట్లాడుతూ ధనవంతులు ప్రతి ఒక్కరూ దానధర్మాలు చేసి దైవానుగ్రహం పొందాలని, ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్న నిరుపేదలకు అండగా నిలబడి వారి కుటుంబాలను ఆదుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి పింఛను తీసుకోకుండా ఉన్న కుటుంబాలకు తమ సంస్థ తరపున అండగా నిలబడతామన్నారు.

నేడు ధార్మిక ఉపన్యాసం

ఒంటిమిట్ట : పోరుమావిళ్ల మండలం, కమ్మవారిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతా లక్ష్మణ హనుమంత సమేత పట్టాభి రామస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ పసుపులేటి వెంకటమ్మ (సంటెమ్మ) కల్యాణ మంటపంలో సోమవారం ఉదయం ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షులు, టీటీడీ ధర్మాచార్యులు డాక్టర్ పసుపులేటి శంకర్ ఆధ్యాత్మిక ఉపన్యాసం చేయనున్నారు. భక్తులకు గడ్డం వెంకటరమణ, గడ్డం కమలమ్మలచే అన్నప్రసాద వితరణ ఉంటుందని తెలియజేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న దాత అజయ్‌రెడ్డి

సుండుపల్లె : ఏటిగడ్డ రాచపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆర్ఆర్ ట్రేడర్స్ అజయ్‌రెడ్డి రూ.20,116లు విరాళం అందజేసినట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో రెడ్డయ్య రాజు, గంగరాజు, టీడీపీ నాయకులు శాంతకుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వీధిలైట్లు పునరుద్ధరణ


మద్దిరేవుల హరిజనవాడలో వీధిలైట్లను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని మద్దిరేవుల పంచాయతీలోని ఈడిగపల్లి, అప్పలరాజుగారిపల్లి, బిల్డింగ్ మాదిగపల్లి, మాలపల్లి, ఎగువ మాదిగపల్లి, దిగువ హరిజనవాడ, వంకగడ్డ హరిజనవాడ, పాత మాదిగపల్లెల్లో ఆదివారం వీధిలైట్ల రిపేరి, కొత్త లైట్ల ఏర్పాటు పనులు చేసినట్టు గ్రామ సర్పంచ్ చంద్రమ్మ పేర్కొన్నారు.

జూదరుల అరెస్ట్

పీలేరు రూరల్ : పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు. వివరాలిలావున్నాయి. మండలంలోని ముడుపులవేముల పంచాయతీ తాణావడ్డిపల్లె సమీపంలో పేకాట ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. జూదరులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ. 10,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బకాయిల చెల్లింపును మరచిన ప్రభుత్వం


మాట్లాడుతున్న ఎస్టీయూ నేత రఘునాథరెడ్డి

రాయచోటి అర్బన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు కొన్ని సంవత్సరాలుగా చెల్లించాల్సిన బకాయిలను కూటమి ప్రభుత్వం మరచిపోయిందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లారు రఘునాథరెడ్డి అన్నారు. ఆదివారం రాయచోటిని ఎస్టీయూ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ సర్వీసు మొత్తం దాచుకున్న డబ్బునుంచి పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐ లోన్‌లు, ఫైనల్ పేమెంట్స్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులలో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుండడం దారుణమన్నారు. దాచుకున్న డబ్బులు పిల్లల చదువులు, పెళ్లిళ్లు, ఇళ్ల నిర్మాణాలకు ఉపయోగపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోందన్నారు. న్యాయపరంగా తమకు అందాల్సిన బకాయిలు అత్యవసరాలకు అందివ్వకుండా సంవత్సరాల తరబడి పెండింగ్‌లో పెట్టడం ఏమిటంటూ ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలగంగారెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మెడికల్ బిల్లులను వెంటనే చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు యాప్‌ల నిర్వహణ భారాన్ని తగ్గించి వాటి నిర్వహణకు ప్రతి పాఠశాలకు ఒక డిజిటల్ అసిస్టెంట్‌ను నియమించాలంటూ కోరారు. అన్నమయ్య, సత్యసాయి జిల్లాల అధ్యక్షులు శివారెడ్డి, హరిప్రసాద్‌రెడ్డిలు మాట్లాడుతూ పీఆర్‌సీ ప్రకటన ఆలస్యమవుతున్న నేపథ్యంలో వెంటనే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని, 117 జీఓను రద్దుచేయాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతో పాటు పనిసర్దుబాటు అసంబద్ధాలను తొలగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ సీనియర్ నేత రవీంద్రనాథరెడ్డి, నేతలు మురళికుమార్, సుధాకర్, రామాంజులు, గోపిక్రిష్ణ, రెడ్డెయ్య, నాగరాజు, శివశంకర్, కృష్ణారెడ్డి, రమణయ్య, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక


సమ్మేళనంలో విద్యార్థులు

పుల్లంపేట : పుల్లంపేటలోని ఎస్‌బీవీడీ సభా హైస్కూల్‌లో 1992 – 93 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పుత్తనవారిపల్లి సమీపంలోని ఓ గార్డన్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళన జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడ కలుసుకుంటున్నట్టు వారు చెప్పారు. తమ మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

నేడు మండల సమావేశం

లక్కిరెడ్డిపల్లి : నేడు ఎంపీడీఓ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డయ్య తెలిపారు. కార్యక్రమానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పరిస్థితులను పసిగడదాం..

పిడుగు బారి నుంచి తప్పించుకుందాం

- కాలంతో సంబంధం లేకుండా వర్షాలు
- భయపెడుతున్న మెరుపులు, ఉరుములు
- అప్రమత్తంగా వ్యవహరించాలంటున్న వైద్యులు



సంబేపల్లె : ప్రస్తుతం వాతావరణ మార్పులను అంచనా వేయలేని పరిస్థితి నెలకొంది. తీవ్రమైన ఎండలు అంతలోనే వర్షాలు ఒక వీధిలో వర్షం కురుస్తుండగా.. పక్కవీధిలో చినుకు పడని పరిస్థితి చూస్తున్నాం. వాతావరణంలో వస్తున్న మార్పులతో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడుతున్నాయి. విపరీత వాతావరణ పరిస్థితులలో ఎప్పుడు వర్షాలు కురుస్తాయో తెలియదు. భారీ వర్షాలు కురిస్తే వాటితో పాటు ఉరుములు, మెరుపులు రావటం సహజం. పిడుగులకు బలమైన అయస్కాంత శక్తితో కూడిన విద్యుత్ శక్తి ఉంటుంది. అందుకే పిడుగుపాటుకు మనుషులతోపాటు జంతువులు బలవుతుంటాయి. పిడుగుల ప్రభావానికి పచ్చని చెట్లు సైతం కాలిపోతుంటాయి. అన్నమయ్య జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పిడుగులు పడి ఆస్తి, ప్రాణ నష్టాలు జరిగాయి. సంబేపల్లె మండలంలో ఇటీవల పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో తొమ్మిది మందికి గాయాలపాలయ్యారు. పిడుగులు పడే ప్రాంతాలపై విపత్తుల నిర్వహణ సంస్థ ప్రజలను అప్రమత్తం చేస్తున్నా నష్టం వాటిల్లుతూనే ఉంది. అయితే తగిన జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాల నుంచి బయటపడవచ్చని నిపుణలు సూచిస్తున్నారు.

పిడుగు పడే ముందు సూచనలు

గాలిలో సుమారుగా 30 వేల డిగ్రీల సెంటీగ్రేడ్‌ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. ఆ గాలి మెరుపులా వేడెక్కి ఒక్కసారి వ్యాకోచనం చెంది పెద్ద శబ్దం వచ్చేదే ఉరుము. ఒక్కసారి మెరుపుతో కూడిన విద్యుత్ భూమి మీదకు చేరుతుంది. దాన్నే పిడుగు అంటారు. చర్మం జలదరింపునకు గురువుతున్నా దగ్గరలో లోహ వస్తువులు ఊగుతున్నాయంటే పిడుగు పాటుకు సంకేతంగా భావించాలి. వర్షాలు పడే సమయంలో బయటకు వెళ్లకపోవడమే మంచిది. ముఖ్యంగా వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలి. ఉరుములు, మెరుపులు వస్తుంటే చెట్ల కిందకు, విద్యుత్ టవర్ల, ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోకి అసలు వెళ్లకూడదు. మెరుపు లేదా పిడుగు కాంతిని చూసే ప్రయత్నం చేయకూడదు. పిడుగుకు కొన్ని మిలియన్ మోగావాట్ల శక్తి ఉంటుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించుకోవాలి.


సమయస్ఫూర్తి అవసరం

వ్యవసాయ పనులు చేసేటప్పుడు ఉరుములు, మెరుపులు వస్తుంటే పిడుగులు పడతాయని భావించి రైతులు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. వెంటనే సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. ఒక వేల వీలు లేకుంటే సమయస్ఫూర్తితో వ్యవహరించి మోకాళ్లపై చేతులు, తలపెట్టి దగ్గరగా ముడుచుకొని కూర్చోవాలి. పిడుగు పడినా అందులోని విద్యుత్ ప్రభావం తక్కువగా ఉండి బతికేందుకు అవకాశాలు ఉంటాయి. ఉరుములు ఉన్నప్పుడు, టీవీ, సెల్ పోన్లు తదితర వాటిని ఉపయోగించకపోవడం ఉత్తమం. ఆరుబయట ఉండటం, స్నానం చేయడం మంచిదికాదు. లోహపు వస్తువుల ద్వార విద్యుత్ ప్రవహించే అవకాశాలు అధికం.

జాగ్రత్తలు పాటించాలి

- సాధారణం ఎత్తుగా ఉండే నిర్మాణాలు, ప్రాంతాల పైన పిడుగులు ఎక్కువగా పడుతుంటాయి. వర్షం కురుస్తున్నప్పుడు ఎత్తయిన చెట్లు, సెల్‌టవర్లు, స్తంభాలు, కొండల వద్దకు వెళ్లకూడదు.
- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి.
- ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు, స్మార్ట్ పోన్లు, విద్యుత్ స్టవ్‌లు, ఇతర విద్యుత్ పరికరాలు ఉపయోగించకూడదు.
- ఉరుములతో కూడిన వర్షం పడుతున్నప్పుడు నీటితో కూడిన పనులను చేయరాదు. పిడుగులు పడిన సందర్భాలలో ముఖ్యంగా శరీరంపై కాలిన గాయాలు కావడం, గుండెపోటు రావడం, పిడుగు శబ్దానికి చెవులు వికసించకపోవడం జరుగుతుంది. వెంటనే వైద్యులను సంప్రదించాలి.

అప్రమత్తంగా ఉండాలి



వర్షాలు కురుస్తున్న సమయంలో ఎత్తయిన ప్రదేశాలకు, చెట్ల కిందకు వెళ్లరాదు. పిడుగు పడే అనుమానం ఉంటే బహిరంగ ప్రదేశంలో భూమిపై కూర్చోవాలి. కూర్చున్నాక చెవులు మూసుకోవాలి. ధ్వని శబ్దం గుండెకు చేరకుండా జాగ్రత్త పడాలి. సెల్ ఫోన్లు వడకూడదు. ఉరుములు మొదలైతే వీలైనంత త్వరగా ఇళ్లకు చేరుకోవాలి. ఏ మాత్రం నిర్లక్ష్యం చేసిన ప్రాణాలు ముప్పు వాటిల్లుతుంది.

– సూర్యనారాయణరెడ్డి, వైద్యులు, పీహెచ్‌సీ, సంబేపల్లె

గో సంరక్షణకు రవీంద్ర విశేష కృషి


రవీంద్రను సన్మానిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజంపేట రూరల్ : గో సేవకునిగా రాజంపేట అగ్నిమాపక కార్యాలయంలో పనిచేస్తున్న రవీంద్రబాబుకు రాజంపేట పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక గుర్తింపు ఉందని రాజంపేట అగ్నిమాపక అధికారి మాబు సుభాన్ అన్నారు. ఆదివారం ఆ శాఖ కార్యాలయంలో గో సేవకుడు రవీంద్రను స్థానిక సిబ్బందితో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గో మాత సంరక్షణకు ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. రవీంద్రబాబు మాట్లాడుతూ తనకు గో సేవ దక్కడం పూర్వజన్మ సుక్రుతమన్నారు. నందలూరు మండల నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ శివార్లలో గోశాల నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.